

'పది' విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచిన విద్యార్థులకు డాక్టర్ మాదాల వెంకటేశ్వర రావు, డాక్టర్ సుజాతమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కఠారి తిరుపాలు స్మారక ప్రోత్సాహక నగదు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ పి.స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 'పది'లో ప్రతిభను కనపరిచిన విద్యార్థులనుద్దేశించి మేయర్, కమిషనర్ మాట్లాడారు. ప్రతి ఏడాది ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, డాక్టర్ సుజాతమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,కెఎన్ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయప్రకాష్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందజేస్తున్న మేయర్

సింహపురి కమ్యూనిస్టు యోధుడు 'జక్కా'..!

కమ్యూనిస్టు యోధుడు... నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కలికితురాయి...ఏడు దశాబ్దాలు అలుపెరగని పోరాట ధీరుడు.. పేద ప్రజల ఆశాజ్యోతి.. కార్మిక, కర్షక, కష్టజీవులకు కొండంత అండ.. బడుగు, బలహీనవర్గాలకు అప్పుడు.. ఉద్యమాల రూపశిల్పి, రాజకీయ నేతలకు జక్కా వెంకయ్య.. పేద ప్రజలు, కార్మికులు, కష్టజీవులకు వెంకన్న.. అవులకు జెవి.. సింహపురిలో పేదల ప్రతినిధిగా ఏడు దశాబ్దాలు అలుపెరగని పోరాటం చేసిన ధీరుడు ఆయన. 2018 మే 29న మృత్యువుతో పోరాడుతూ తుది శ్వాస విడిచారు. మన నుంచి దూరమై ఐదేళ్లు గడిచింది. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయడమే ఆయనకు ఇచ్చే నివాళి..

- భూస్వామ్యకుటుంబంలో పుట్టి.. కడవరకు పేదల కోసం ..!
- ఉద్యమ రూపకల్పనలో ఆయనకు సాటి ఎవరు ..!
- ఏడు దశబ్దాల ఉద్యమ ప్రస్థానం
- నేడు ఐదో వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య సింహపురి రాజకీయ చరిత్రలో ఒక వేగు చుక్క. భూస్వామ్య రాజకీయాలు, పెత్తందారులు రాజ్యమేలుతోన్న తరుణంలో పేదల కోసం తానున్నానంటూ సింహపురి గడ్డపై ఉదయించారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం, దామర మడుగు గ్రామంలో 1930 నవంబర్ 3న జక్కా రమణయ్య, జక్కా శంకరమ్మ దంపతులకు జన్మించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని హైస్కూల్లో ఎస్-ఎస్ఎల్‌సి చదివారు. ఆయన విద్యాభ్యాసం తర్వాత 1951 వరకు గ్రామంలో వ్యవసాయం చేశారు. 1948 నుంచి 1951 వరకు ఆనాటి కమ్యూనిస్టుపార్టీ నిషేధంలో ఉన్నందున రహస్య జీవితం గడిపే కమ్యూనిస్టు నాయకులు దామరుమడుగులో తలదాచుకునేవారు. గ్రామంలో జక్కా వెంకయ్య వారికి రక్షణగా నిలిచారు. 1948లో మద్రాసు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. దామరమడుగు గ్రామంలో జక్కా వెంకయ్యను అరెస్టు చేసి కోవూరు కోర్టులో 15రోజులు రిమాండ్‌లో ఉంచారు. 1951లో భూమికోసం, భుక్తి కోసం తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటాల స్ఫూర్తితో డాక్టర్ జెట్టిశేషారెడ్డి ప్రోత్సాహంతో పార్టీ సభ్యులుగా చేరారు. అప్పుడే 1951లోనే దామరమడుగులో కమ్యూనిస్టు పార్టీ శాఖను ఏర్పాటు చేశారు. 1953లో వ్యవసాయ కూలీలకు ఆరు సవా సేర్లు కూలి కావాలని స్వగ్రామం నుంచి జక్కా పోరాటానికి నాయకత్వం వహించారు. 1956లో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో పార్టీ విజయం కోసం జక్కా విస్తృతంగా తిరిగారు. 1957లో దామరమడుగు గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. 1957నుంచి 1964 వరకూ దామరమడుగు సర్పంచిగా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. 1963నుంచి దేశంలోని ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన భిన్నాభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని సిపిఎం నిర్మాణానికి కృషిచేశారు. 1965లో ఉద్యమంలో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో సంవత్సరం ఐదు నెలలు జైలు జీవితం గడిపారు. 1968లో కమ్యూనిస్టు ఉద్యమంలో తిరిగి భిన్నాభిప్రాయాలు వచ్చినప్పుడు జిల్లాలో సిపిఎంను నిలబెట్టేందుకు ఎనలేని కృషిచేశారు. 1969లో సిపిఎం జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1952 నుంచి 1956వరకూ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1958 నుంచి వ్యవసాయ కార్మిక ఉద్యమంలో కీలకపాత్ర వహించారు. 1972లో అల్లూరు నియోజకవర్గం శాసనసభ్యునిగా పోటీ చేసి కేవలం 504ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1958 నుంచి 1972వరకూ జిల్లాలోని చెరువులోతట్టు బంజరు సాగు దార్ల పోరాటానికి నాయకత్వం వహించారు. జిల్లాలో సుమారు 10వేల ఎకరాలు రైతులకు దక్కేలా చూశారు. 1974లో బంజరు భూముల ఆక్రమణ, వ్యవసాయ కూలీల కూలిరేట్ల కోసం జరిగిన పోరాటానికి జక్కా నాయకత్వం వహించారు. 1974లో మేలో జరిగిన చారిత్రాత్మక రైల్వే సమ్మెను జయప్రదం చేసేందుకు రహస్య జీవితం గడుపుతూ కృషిచేశారు. 1975లో ఎమర్జెన్సీలో సంవత్సరం ఐదునెలలు నెల్లూరు జైలులో ఉన్నారు. మధ్యలో ఒక నెల ముషీరాబాద్ జైలుకు తరలించారు. జక్కా జైల్లో ఉన్న సమయంలో రాజకీయ క్లాసులు బోధించారు. సత్యనారాయణరెడ్డి, గౌత్ లచ్చన్న కూడా ఈయన క్లాసులు వినేవారంటూ జక్కా వెంకయ్య తెలివితేటలు ఏపాటివో అర్థం చేసుకోవచ్చు. 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోవూరు నియోజవకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1978లో జిల్లాలో బంజరు భూముల ఆక్రమణ ఉద్యమాన్ని నిర్వహించారు. 1979 మార్చిలో రికార్డుల్లో లేకుండా చేసిన అదనపు భూములను బయటకు వెలికితీయాలనే పోరాటంలో యల్లాయ 1పాళెంలో పోలీసు కాల్పులు జరిగాయి. అందులో గాలంకి తిరుపాలు మృతిచెందారు. 1979మేలో తుపాన్ సందర్భంగా జిల్లాలో అఖిలపక్ష రైతు ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. పోరాట ఫలితంగా రైతులకు కొన్ని రాయితీలను ప్రభుత్వం అందించింది. ఉద్యమ సందర్భంగా కావలిలో జరిగిన కాల్పుల్లో గౌరవరం రైతు చింతా శేషారెడ్డి మృతిచెందారు. వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు పార్టీ తరపున ఆర్థిక సాయం అందించారు. 1983 ఎన్నికల్లో కోవూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1984లో జరిగిన ప్రజాస్వామ్య పున రుద్ధరణ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. 1985లో అల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఎల్ఏగా గెలు పొందారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. రైతుల సమస్యలపై ప్రధాన దృష్టిపెట్టారు. 1989లో అల్లూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అల్లూరు నుంచి పోటీ చేసి తిరిగి మళ్లీ ఎన్నికయ్యారు. 1996లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2002లో ఆక్వా రైతుల సమస్యలపై జరిగిన దీర్ఘకాలిక పోరాటానికి జక్కా నాయకత్వం వహించారు. 2002లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా 1948లో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. 1951లో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 67 ఏళ్లు పార్టీ సభ్యునిగా ఏడు దశాబ్దాలు నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో జక్కా కీలక భూమి పోషించారు. 2004లో ఆయనకు గుండెపోటు రావడంతో నెల్లూరు రామచంద్రారెడ్డి, చెన్నయ్‌లోని విజయ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గుండె 30శాతం పనిచేసినా 14 సంవత్సరాలు జీవించారు. జిల్లాలోని పేదలు, కార్మికులు, కర్షకులు, కష్టజీవులు, ఏ ఒక్కరికి చిన్నపాటి కష్టమొచ్చినా బాలాజీ నగర్‌లోని సిపిఎం కార్యాల యం., అందులో ఉండే జక్కా వెంకయ్య గుర్తుకు వచ్చేవారు. ఎవరు ఏ కష్టంతో వచ్చినా ఆయన అందుకు పరిష్కారం చూపేవారు. రోజుకో పార్టీ మారుతూ, ధనార్జనే ధ్యేయంగా నడుస్తోన్న నేటి పరిస్థితుల్లో తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం 70 సంవత్సరాలు పనిచేసిన గొప్ప వ్యక్తి జక్కా వెంకయ్య., రాజకీయ నేతలు ఆయనను జక్కా వెంకయ్య అంటారు. పేద ప్రజలు వెంకన్న అంటారు.. ఆయన సన్నిహితుల జెవి అంటారు. ఇరిగేషన్ సమస్యలు ఏవి వచ్చినా కలెక్టర్లు, మంత్రులు, పెద్ద పెద్ద మేధావులు జక్కా వెంకయ్య సలహాలు తీసుకునే వారంటే ఆయన ప్రతిష్ట ఎంతదో తెలుస్తోంది. జిల్లాలో జరిగిన అనేక సామాజిక ఉద్యమానికి ఆయన ఆద్యుడు. అంతటి యోధుడు. 2018 మే 29న ఆనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దూరమై నేటితో ఐదు సంవత్సరాలు గడుస్తోంది. ప్రజల మనస్సులో జక్కా వెంకయ్య చిరకాలం ఉంటారు.



జక్కా వెంకయ్య (ఫైల్)

30న నిరాహార దీక్ష

నెల్లూరు :ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపిజెఎసి అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యా చరణలో భాగంగా రేపు అనగా 30వ తేదీ మంగళవారం ఒక్కరోజు సామూహిక నిరాహార దీక్ష చెప్పట్లనున్నట్లు ఏపీ జెఎసి అమరావతి జిల్లా శాఖ చైర్మన్, సెక్రటరీ జనరల్ అల్లం పాటి పెంచల్ రెడ్డి, ఓ వి ప్రసాద్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు జిల్లాలోని జేఏసీ అమ రావతి అనుబంధ సంఘాల నాయకులు ఉద్యోగులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు నిర్వహిస్తున్న దీక్షా కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎపిజెఎసి అమరావతి చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలియ జేయాలన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అదాని వరల్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు :అరుణాచలప్రదేశ్ , ఈటా నగర్ ప్రాంతంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ మిక్స్‌డ్ డబుల్స్ క్రీడా పోటీలల్లో అదాని వరల్డ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపరిచారు. ఈ జాతీయ స్థాయి పోటీలల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు రజత పతకాన్నిసొంతం చేసుకున్నారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనపరిచి, రజత పథకాలను సొంతం చేసుకున్న పి. మేధాన్ రెడ్డి(ఏడవ తరగతి), పి. తన్మయ్ తేజ్ రెడ్డి(నాల్గవ తరగతి) విద్యార్థులను , ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యాబోధన తోపాటు పిల్లలకు క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహిం చడంలో అదాని వరల్డ్ స్కూల్ ఎప్పుడూ ఒక అడుగు ముందుంటుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటిత పోరాటాలు

ప్రజాశక్తి -కందుకూరు :సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా నాయ కులు పి మాలకొండయ్య పిలుపునిచ్చారు. ఏ ఐ టి యు సి నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఆ సంఘం గౌర వాధ్యక్షులు పి బాలకోటయ్య అధ్యక్షతన ఆదివారం సి పి ఐ కార్యాలయంలో జరిగింది. మాలకొండయ్య మాట్లాడారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు ఏఐటియుసి నియో జకవర్గ కార్యదర్శి వై ఆనంద్ మోహన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి మాల్యాద్రి, నర్సయ్య పాల్గొన్నారు. ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడిగా కె మురళీకష్ణ కోశాధికారిగా అన్నవరపు బ్రహ్మయ్యను కగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేసుల పరిష్కారంపై

బాధితులకు భరోసా కల్పించాలి

ఐజిపి పాలరాజు

ప్రజాశక్తి-నెల్లూరు : పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగించాలని గుంటూరు రేంజ్ ఐజిపి పాలరాజు పోలీస్ యంత్రాంగానికి సూచించారు. ఆదివారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలులో ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐజిపి పాలరాజు ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి జిల్లా భౌగోళిక స్థితిగతులు, పోలీస్ స్టేషన్లు, సిబ్బంది వివరాలు, శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల వివరాలు, పోలీసులు పనితీరు, జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యలు తదితర అంశాలు గురించి ఐజిపికి వివరించారు. అనంతరం ఐజిపి పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో పోక్సో కేసులు, మహిళలకు సంబంధిత కేసులు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు మొదలైన కేసులు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరూ కషి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొదటి ఐదు స్థానాలలో ఉన్న పోలీస్ స్టేషన్ పరిధిలలో రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక దష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న గ్రేవ్ ,నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, సైబర్ సంబంధిత నేరాలలో రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్షించారు. జిల్లా స్థాయి పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాలరాజు

30న సిఐటియు బహిరంగ సభ

ప్రజాశక్తి-నెల్లూరు :సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఈ నెల 30న పప్పుల వీధి సమీపంలోని వాటర్ ట్యాంక్ పార్కుప్రాంతంలో నిర్వహించే బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మికులు, కర్షకులు హాజరై విజయవంతం చేయాలని సిఐటియు నగర నాయకులు కోరారు.ఆదివారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో బాలాజీనగర్ సమీపంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో మీడియా సమీవేశం నిర్వహించారు. సిఐటియు నగర కమిటీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం సా యంత్రం 5:00 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుంచి పప్పుల వీధి, వాటర్ ట్యాంక్ పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన సభా వేదిక వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభను నిర్వహిం చనున్నట్లు తెలిపారు. నిరంతరం కార్మిక కర్షక ప్రజా శ్రేయస్సు కోసం సిఐటియు నగరంలో అనేక పోరాటాలు చేయడంలో కీలక భూమికను పోషిస్తుం దన్నారు. రవాణా రంగంలో ఆటో లారీ టాక్సీ మినీ వ్యాను తదితర రంగాల కార్మికుల సమస్యలపై పరిష్కారం కొరకు నిరంతరం పోరాడుతుందన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై అనేక పోరాటా నిర్వహించింది నాయకులపై కేసులు బనాయించిన చెదరని విశ్వాసంతో కార్మికుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి సిఐటియు కృషి చేసిం దన్నారు. మే నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నగరంలోని కార్మికులు పని ప్రదేశాలలో నివాస ప్రాంతాల్లో కార్మికులకు ఉత్సాహం ఉల్లాసం నింపేందుకు అనేక ఆటలు, పాటలు డాన్స్ తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. సిఐటియు నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, మూలం ప్రసాద్, బి. రాంబాబు, పి. సుధాకర్ ,యం. అశోక్, పి. వేణు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ఆధ్యాత్మిక కార్యాక్రమాల ద్వారా మానకిస ప్రశాంతత లభిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ ఇఒ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షణలో, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరు రవీంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ మర్యాదలతో మంత్రి కాకాణికి ఆలయ అర్చకులు బొడ్డుపల్లి శ్రీనివాసన్ శర్మ, బొడ్డుపల్లి మోహన్ కష్ణలు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సాంప్రదాయ పద్ధతిలో మంత్రి కాకాణి పట్టు వస్త్రాలు సమర్పించారు.వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, కామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లిపూడి సునీల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

నేడు అన్నదానం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :జక్కా వెంకయ్య ఐదో వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 29వ తేదీన పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా, సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్షులు నాసిన పరశురామయ్య ఆదివారం తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వరూ..

పొదలకూరు :మండలంలో అగ్నికుల క్షత్రియ కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆయా సామాజికవర్గ ప్రజలు తాసిల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగిపోయేలాగా తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు అగ్నికుల క్షత్రియ కులం వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేమని చెబుతున్నారు. దీనిపై ప్రశ్నించగా ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశం లేదని చెబుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని గంగపాలెం గ్రామంలో కావలి చైతన్య హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం పంచాయితీ కార్యలయంలో ఉచిత మోగా మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంప్‌ను సర్పంచ్ పేలపల్లి మహేష్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంగా ఉన్న గంగం పాలెంలో వైద్యశిబిరం నిర్వహించడం అభినం దనీయమన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోని వైద్య పరీక్షలు చేయించు కున్నారన్నారు. చైతన్య హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.చైతన్య గ్రామస్తులకు పరీక్షలు చేశారు. ఎముకలు, కీళ్ల,నరములు తదితర పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. మెడికల్ క్యాంప్ పెట్టాలని కొరిన వెంటనే స్పందించి క్యాంప్‌ను ఏర్పాట్లు చేసిన డాక్టర్ చైతన్యకు పాలంకి గురుబ్రహ్మయ్య,బేదంశెట్టి వీరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

గంగపాలెంలో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

గడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి - లింగసముద్రం :మండంలలోని మాలకొండరాయునిపాలెం గ్రామానికి చెందిన గాయం శ్రీనివాసులు వరిగడ్డి నిప్పు అంటుకొని కాలిపోయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ అగ్నిప్రమాదంలో సూమారు లక్ష రూపాయల విలువ చేసే పశువుల మేత అగ్నికి బూడిదైందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆగస్టులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు : బాపట్లలో ఆగస్టు నెలలో జరిగే వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదంచేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నంది పోగు రమణయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం సంతపేట లోని సిపిఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ బాడీ విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నంది పోగు రమణయ్య మాట్లాడుతూ బిజెపి అధికారంలో వచ్చిన తరువాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు వ్యవసాయ కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు.ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించని కారణంగా వంద రోజులు పని చూపించాల్సిన ప్రభుత్వం 50 రోజులు మాత్రమే చూపిస్తుం దన్నారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎకరాకు రూ.30వేలు ఖర్చు పెడితే రైతు కనీసం పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు . వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా దండూరు కామేశ్వరరా వును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, సిపిఐ కోవూరు నియోజకవర్గ కార్యదర్శి మున్వర్, జిల్లా కన్వీనర్ మున్నా, డి హరికష్ణ, డి కళ్యాణ్, ఎస్ హరి, కే పవన్, వంశి, దస్తగిరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు : కాకాణి

ప్రజాశక్తి వెంకటాచలం

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయంగా ఉండటంతోపాటు ప్రజలకు మేలు జరుగుతోందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలో సర్వేపల్లిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టారు. దారిపొడవునా పూల వర్షం కురిపిస్తూ ప్రజలు మంత్రికి నీరాజనం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 194 రోజులు పాటు 96 వేల కుటుంబాల్ని కలిసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించాలని కోరారు.

పొదలకూరు :మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి మద్దతుగా వెంకటాచలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ముగింపు సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. 1వ వార్డ్ మెంబెర్, మాజీ ఎంపీటీసీ కో-ఆప్టెడ్ సభ్యుడు, సచివాలయం కన్వీనర్అంజాద్, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, స్వర్ణ శేఖర్ బాబు. ఎంపీటీసీ కో.ఆప్షన్ షేక్ .దస్తగిరి ఉన్నారు.

మంత్రి కాకాణిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఎస్‌టిలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో 10 లక్షలు ఉన్న యానాదులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ కేంద్రంగా ఆగస్టులో లక్షమందితో యానాది గర్జన నిర్వహిం చనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ కెసి పెంచలయ్య తెలిపారు. ఆదివారం నగరంలోని జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 8 జిల్లాల నుంచి యానాది సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజర య్యారు. ఈ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి నగర మేయర్ పొట్లూరి స్రవంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్‌టి కమిషన్ చైర్మన్ పదవి యానాదులకు కేటాయించాలని, ప్రభుత్వం తక్షణమే యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంఎల్‌సి పదవిని కేటాయించాలన్నారు. యానాదుల జనాభా అధికంగా ఉన్న కోవూరు అసెంబ్లీ సీటును యానాదులకు కేటాయిం చాలని తీర్మానించారు. గిరిజన నాయకులు యందేటి వెంకటసుబ్బయ్య, చేవూరు సుబ్బారావు, బిఎల్ శేఖర్. బషీర్, యల్లంపల్లి రమేష్, పుత్తూరు శ్రీనివాసరావు, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతన్న మేయర్ పి స్రవంతి

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు

తోటపల్లిగూడూరు :మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెరపై మకుటం లేని మహారాజుగా వెలుగొందిన గొప్ప వ్యక్తి అని టిడిపి రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మహానటుడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు జరిగాయి. టిడిపి కన్వీనర్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి అధ్యక్షతన, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొణతం రఘుబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు రాధాకష్ణ నాయుడు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. చినబాబి రెడ్డి, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, మండల కార్యదర్శి ముత్యాల శ్రీనివా సులు, సర్పంచ్ వెంకట చైతన్య కుమార్ పాల్గొన్నారు.

పొదలకూరు :సంక్షేమ పథకాలకు ఆద్యుడు.. ఎన్‌టిఆర్ అని మండల టిడిపి అధ్యక్షులు తలచీరు మస్తాన్ బాబు ,పట్టణ అధ్యక్షులు బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక పంచాయతీ బస్టాండ్ లో మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ టీడీపీ నాయకులు పిడుగు సుధాకర్‌ని సత్కరించారు. అనంతరం టీడీపీ మండలా ధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు,పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లిఖార్జున నాయుడు మాట్లాడారు.

వలేటివారిపాలెంలో..

కందుకూరు : టిడిపి కార్యాలయంలో నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ పట్టణ టిడిపి అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి చిలకపాటి మధు, షేక్ మున్నా, షేక్ రూబీ చుండూరి శ్రీను, ముచ్చు వేణు, షేక్ సలాం పాల్గొన్నార.

వలేటివారిపాలెం :మండలంలోని పోకూరు ప్రధాన సెంటర్లో నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఆదివారం తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో రానున్న ఎన్నికలలో కలిసి కట్టుగా పనిచేసిటిడిపి విజయానికి కృషి చేయాలని యువ నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం 400 మదికి అన్నదానం చేశారు. టిడిపి నాయుకులు మాజీ ఎఎంసి చైర్మన్ ఘట్టమనేని చెంచురామయ్య, నలమోతు రవీంద్ర, ముండ్లమూడి మాలి, లక్ష్మీనరసింహ, మక్కే న శ్రీను, సుబ్బానాయుడు, అత్తంటి వెంకటేశ్వర్లు, మన్నం వెంకటరావు, సంజీవ, మనోజ్, రామన్న చౌదరి, బెంజిమన్, నాగభూషణం, చెన్నకేశవులు, నలమోతు అనిల్ పాల్గొన్నారు.

'అపోలో' ఆస్పత్రి అరుదైన రికార్డు

ఒకే రోజు 13 రోబోటిక్ శస్త్ర చికిత్సలు

నెల్లూరు :నగరంలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్, రోబోటిక్ నీ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి ఒక్క రోజులో 13 మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అపోలో వైద్యులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థోపెడిక్ సినయర్ కన్సల్టెంట్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి మాట్లాడారు. మహా నగరాలకే పరిమితమైన ఈ మోకాళ్ళ మార్పిడి రోబోటిక్ సర్జరీని నగరంలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్లో అందుబాటులోకి తీసుకొచ్చామ న్నారు. గతంలో నిర్వహించే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో అనేక ఇబ్బందులు ఉండేవన్నారు. రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ ద్వారా, కచ్చితత్వంతో పాటు, రోగికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడం, నొప్పి కోత తక్కువగా ఉండడం, త్వరగా రికవరీ కావడం వంటివి ఎంతో మేలు చేస్తా యన్నారు. ఈ ఆధునిక విధానంలో రోగికి శస్త్ర చికిత్సలు నిర్వహించడం ద్వారా త్వరగా కోలుకోవడంతోపాటు, శాస్త్ర చికిత్స అనంతరం కూడా నొప్పి లేకుండా, రోజువారీ కార్యక్రమాలు యధావిధిగా నిర్వహించుకోగలరన్నారు. అపోలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి, డాక్టర్ షాహల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్లు

కాలుష్యాన్ని నివారిద్దాం.. !

పజాశక్తి -కందుకూరు :రవాణా శాఖ ఆధ్వర్యంలో "మిషన్ లైఫ్" గురించి అవగాహన కల్పించేందుకు కందుకూరు మోటారు వాహనముల తనిఖీ అధికారి ఎమ్‌డి రఫీ ఆటో డ్రైవర్లు, మోటార్ క్యాబ్, ఇతర మోటారు వాహన చోదకులకు అవగాహన కల్పించారు. కందుకూరు పట్టణంలోని జీబ్ స్టాండ్ వద్ద వాహన కాలుష్య నియంత్రణ కోసం ప్రతి ఒక్క మోటారు వాహన చోదకుడు తమవంతు బాధ్యతగా ట్రాఫిక్ సిగ్నల్స్ పడినప్పుడు వాహన ఇంజెన్ ఆఫ్ చేసుకోవాలని సూచిం చారు. వాహన కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల వ్యాధుల సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వాహన కాలుష్యాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడు కుందాం. .అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. కందుకూరు టౌన్ ఎఎస్‌ఐ మాల్యాద్రి రెడ్డి ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జాగ్రత్తలు తీసుకోకపోతే 'వడదెబ్బ'

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య



ప్రజాశక్తి-నెల్లూరు

వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బకు గురవుతారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య తెలియజేశారు. వాతావరణ కాలుష్యంతో భూతాపం రోజురోజుకీ పెరిగి పోతోంది. దీనికి తోడు వేసవి కాలం కావడంతో భూమి నిప్పుల కుంపటిని తలపించే విధంగా దర్శనమిస్తుంది. ఏ ఏడాదికి ఆ ఏడాది ఎండలు ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయే కానీ కాస్తకూడా కనికరం చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది భానుడి ప్రతాపం అధికంగా ఉండటంతో 'వడదెబ్బ'కు అనేక మంది గురవుతున్నారు. నీడలో ఉన్నా ఇంట్లో ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగలవచ్చు. రేకుల షెడ్లలో నివసించే వారికి, గాలి, వెలుతురు చొరబడని ఇళ్లల్లో ఉండేవారికి, పిల్లలకు, వృద్ధులకు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన మాటల్లో..

ప్రశ్న. వడదెబ్బకు గురైనట్లు ప్రజలు గుర్తించేందుకు ప్రధాన లక్షణాలు ఏమైనా ఉన్నాయా.. ఆ లక్షణాలు ఏమిటీ..? వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..?

జవాబు. వడదెబ్బకు గురయ్యేందుకు వయస్సుతో నిమిత్తం లేదు. ఎవరైనా గురికావచ్చు. ఈ వడదెబ్బకు గురైన వారు విపరీతమైన జ్వరం, తలనొప్పి, తల తిరగడం, గుండె దడ లాంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. తీవ్ర వడదెబ్బ తగిలితే చెమటలు పట్టవు. నాలుక తడి ఆరిపోతుంది. దప్పిక ఎక్కువగా ఉంటుంది. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. పిచ్చి పిచ్చిగా మాట్లాడతారు. చివరికి స్పృహ తప్పి అపస్మారక స్థితికి చేరుకుంటారు. ఎండాకాలంలో బయటకు వెళ్లే సమయంలో గొడుగును ఉపయోగించాలి. చలువ అద్దాలు ధరిస్తే కంటిమీద ఎండ ప్రభావం తగ్గించుకోవచ్చు. మంచినీళ్ల వెంట తీసుకొని వెళ్లి తరచుగా తాగుతూ ఉండాలి.ఎండాకాలంతో దూరపు ప్రయాణం మంచిది కాదు. ప్రయాణం చేయవలసి వస్తే రాత్రిపూట ప్రయాణం చేయడం శ్రేయస్సు.

ప్రశ్న. వడదెబ్బకు గురైనట్లు అనుమానం వస్తే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎటువంటి ఆహారం తీసుకోవడం మంచిది.?

జవాబు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే రోగిని చల్లని గాలి తగిలే ప్రదేశానికి మార్చాలి. శరీరం మీద బిగుతుగా ఉన్న దుస్తులను తీసేసి పల్చటి బట్ట కప్పాలి. వేపచెట్టు, కానుగ చెట్టులాంటి మంచి నీడ నిచ్చే చెట్టుంటే క్రిందకు తీసుకెళ్లడం మంచిది. వడదెబ్బకు గురైన పసిపిల్లలను, ముసలి వాళ్లను వీలైనంత వరకు ఇటువంటి చెట్ల కిందకు చేర్చి ప్రథమ చికిత్సలు నిర్వహించడం మంచిది. తల నుంచి కాళ్ల వరకు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లని నీళ్లు పోసి ఒంటి మీది బట్టలను తడపాలి. ఫ్యాను అందుబాటులో ఉంటే ఒంటిమీద పోసిన నీళ్లు ఆవిరయ్యే విధంగా ఫ్యాను ఉపయోగించడం మంచిది, ఫ్యాను అందుబాటులో లేకపోతే అట్టముక్కలతో గానీ, విసనకర్రతో గానీ విసురుతూ ఉండాలి. గుడ్డ ఆరిపోతే మరలా తడుపుతుండాలి. పసిపిల్లల శరీరమంతా ఉదయం 10 గంటలల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరచుగా చన్నీళ్లతో తుడుస్తూ ఉండాలి. ఎండలో పనిచేసేటప్పుడు తలమీద, మెడచుట్టూ తడిపిన దస్తులు చుట్టుకోవాలి. తలమీద టోపి పెట్టుకోవాలి. ఉప్పు కలిపిన నిమ్మ రసం తాగుతుండాలి. వేడి గాలల నుంచి తప్పించుకొనేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు గదికి ఉన్న కిటికిలకు వట్టి వేళ్లతో తయారు చేసిన తడికెలు కట్టుకొని నీటితో తడుపుకుంటుండాలి. వడదెబ్బకు గురైన వారికి ఉప్పు కలిపిన నిమ్మరసం తాగించాలి. ఒకవేళ వాంతి అయినా నీళ్లు తాగించడానికి వెనుకాడకూడదు. పోయేది పోయినా కొంతైనా పొట్టలో నిలుస్తుంది. ఐస్ ముక్కలు చంకల్లో ఉంచితే ఉష్ణోగ్రత త్వరగా తగ్గుతుంది. రోగి అపస్మారక స్థితిలో ఉంటే తడిగుడ్డ వైద్యం చేస్తూనే ఆసుపత్రికి తరలించాలి.

ప్రశ్న. ఎటువంటి దుస్తులు ధరించడం మంచిది.? ఎటువంటి ఆహారం తీసుకోవాలి..?

జవాబు. ఎండాకాలంలో ఎవరైనా సరే నల్లని దుస్తులు. ముదురు రంగు దుస్తులు ధరించకూడదు. తెల్లని దుస్తులు, లేత రంగు దుస్తులు ధరిస్తే మంచిది. అదే విధంగా నైలాన్, టెర్లిన్, టెరికాట్ దుస్తులు ధరించకూడదు. నూలు (కాటన్) దుస్తులు ధరించడం మంచిది. బిగుతుగా ఉండే దుస్తులు ధరించరాదు. ఎండాకాలం తప్పకుండా రెండుపూటలా స్నానం చేయాలి. తేలికగా అరిగే ఆహారం తీసుకోవాలి. మాంసాహారాన్ని వీలైనంతవరకు తగ్గించుకోవాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అవి కూడా సాధ్యమైనంత వరకు ఇంట్లో తయారు చేసినవి తీసుకోవడం. మంచిది. నడక, వ్యాయామం చేసేవారు ఎండలేని సమయంలోనే చేయాలి అంటే ఉదయం 9 గంటల 9 లోపు సాయంత్రం 5 గంటల తరువాత తప్పనిసరి అయితే చెట్ల నీడలో వ్యాయామం చేయాలి.

ఇంటర్వ్యూ

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

30వ తేదీన సిఐటియు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు నగరంలో జేమ్స్ గార్డెన్‌లో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 30వ తేదీన జిల్లా సిఐటియు స్వంతనూతన భవన ప్రారంభోత్సవం జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కావలికి వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 40వేల సభ్యత్వం కలిగిబలమైన సంఘంగా ఉందన్నారు. వివిధరంగాలు, సంఘాలు సిఐటియుకి అనుబంధంగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన ఆర్‌టిసి, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, మున్సిపల్ కార్మికులు, లారీ, టాక్సీ, ఆటోకార్మికులు, హమాలీలు, మధ్యతరగతి, ఉద్యోగులు తమ ఒకరోజు వేతనాన్ని తమ కార్యాలయ భవనం నిర్మించేందుకు విరాళాలు ఇచ్చారన్నారు. ఈ భవనాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరశింగరావు ప్రారంభిస్తారని తెలిపారు. భవిష్యత్‌లో జరిగే అసంఘటిత రంగ కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు పోరాటాలకు సరళీకరణ విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న కష్టాలకు వ్యతిరేకంగా నిలుస్తుందని, భవిష్యత్‌లో జరిగే పోరాటాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి సిఐటియు అనుబంధమైన అన్నిరంగాల కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్.రెహానాబేగం, కావలి పట్టణ సిఐటియు కార్యదర్శి వై.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో అభివృద్ధి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికమని కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇందుకూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందన కార్యక్రమంలో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవావజ్ర, సేవా మిత్ర, సేవారత్న వచ్చిన వలంటీర్లకు శాలువాలు కప్పి అవార్డులు అందించారు. అనంతరం ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిస్తుందన్నారు. ప్రజలందరూ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, గుణపాటి సురేష్ రెడ్డి, జెడ్పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, గూడూరు ప్రభాకర్ రెడ్డి, ఉడతా వెంకట శేషయ్య, కైలాసం శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగం : ఎంపిడిఓ కార్యాలయంలో వలంటీర్ల వందన కార్యక్రమంలో భాగంగా ఆదివారం వలువురిని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి సన్మానించారు. సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న వాలంటీర్లను ఘనంగా సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్ల పాత్ర అమోఘమని తెలిపారు. రాబోయే రోజుల్లో వాలంటీర్ల పని తీరును బట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వేతనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వలంటీర్ల పనితీరును ఓర్వలేక ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షానికి నాలుగు టివి ఛానళ్లు ఉంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వాలంటీర్లే చానళ్లు అని పేర్కొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : గ్రామ, వార్డు వలంటీర్, సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చూసి పక్క రాష్ట్రాలు అయినా తమిళనాడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదర్శంగా తీసుకున్నారని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విడవలూరు మండల కార్యాలయంలో జరిగిన వలంటీర్లకు వందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో గ్రామ సచివాలయ వలంటీర్ వ్యవస్థ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా గ్రామ ప్రజల కోసం పనిచేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల చూసుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు కాసేవారని ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోడి కూయక ముందే తెల్లవారుజాము అర్హులైన ప్రతిఒక్కరికి వృద్ధాప్య పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరవేయడంలో గ్రామ సచివాలయ వలంటీర్ వ్యవస్థ ముందంజలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి భవనమ్మ, జెడ్‌పిటిసి లక్ష్మమ్మ, కోటంరెడ్డి నవీన్ రెడ్డి, రామిరెడ్డి విజయ్ భవన్ రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, పుండ్ల అచ్యుత్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే విజ్ఞానం

ప్రజాశక్తి-ఉదయగిరి

పుస్తకాల చదువుతోనే మనో వికాసం విజ్ఞానం పొందవచ్చని రిసోర్స్ పర్సన్ షేక్ హలీమా అన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ లైబ్రరీలో చదువు ఉన్నత స్థాయికి చేర్చే విజ్ఞానం పొందవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ గ్రంథాలయాల సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు సృజనాత్మకత ఆలోచన శక్తి పుస్తక పఠనంతో ఉపకరిస్తుందన్నారు. కథలు చెప్పడం క్విజ్ పోటీలు జనరల్ నాలెడ్జ్ నిర్వహించడం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ షేక్ ఫజుల్ చిన్నారులు పాల్గొన్నారు.

విరువూరులో మోస్తరు వర్షం..

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు, కృష్ణంరాజుపల్లి, గ్రామంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు ఆకాశం మేఘావృత్తమై వాతావరణం చల్లబడి, పెద్దపెద్ద ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం పడింది. ఈ ఈదురు గాలుల దాటికి చెట్లు సైతం విరిగిపడ్డ ఎస్‌సి కాలనీకి వెళ్లే దారిలో పెద్ద చిల్లచెట్టు విరిగి రోడ్డుకి అడ్డంగా పడింది. దీంతో విద్యుత్ సైతం కొంతసేపు అంతరాయం ఏర్పడింది. వర్షం పడటంతో కొంత వాతావరణం చల్లబడింది. ఈ వర్షం అనేది ఇలాగే కొనసాగితే ఏదైనా మేలు చేకూరుతుంది. లేకపోతే ఈ వడగాలులు దెబ్బకు వృద్ధులు చిన్నారులకు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవుతాయని ప్రజల చర్చించుకుంటున్నారు.

జామాయిల్ తోటలో మంటలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

జామాయిల్ తోటలో మంటలు రాజుకుని చెట్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న ఏడు ఎకరాలలో జామాయిల్ తోట సాగులో ఉంది. ఆది అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి బాధిత రైతులకు తెలిపారు. బాధిత రైతులు బిట్రగుంట రాఘవమ్మ 4 ఎకరాలు వెంకట్ నాగులు 3 ఎకరాలు కాలిపోయాయి. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పి వేశారు.

29న బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-సీతారామపురం

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సోమవారం నియోజకవర్గ కేంద్రంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న అనంతరం కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. సోమవారం ఉదయగిరిలో జరిగే బైక్ ర్యాలీలో భారీ సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొని బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు విరాళం

ప్రజాశక్తి-బిట్రగుంట

కొడవలూరు మండలం రామన్నపాలెం సమీపంలో తురకా కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగ శిక్షణ కేంద్ర నిర్వాహకుల ప్రముఖ సంఘసేవకులు కాండ్ర సతీష్ నాయుడు రూ.25వేల విరాళం సతీష్ నాయుడు దయనెస్తు సబ్బులు బాపట్ల వెంకటపతి చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తురక వెంకటరాముడు, భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ కట్టెపల్లి సింహాద్రి రావు, బాపట్ల వెంకటపతి, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, జయంపు కనకయ్య, హెడ్ కానిస్టేబుల్ రమణయ్య, పీట్ల ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

గౌడుకు మిరియాల, పి.వి. కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఉదయగిరి

జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వరావు గౌడ్‌కు ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ మిరియాల రమణయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పివి రమణయ్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మహారాష్ట్ర షిర్డీలో నిర్వహించిన జాతీయ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అత్తవాలా సమావేశంలో పేరం శివ నాగేశ్వరావు గౌడ్ జాతీయ కౌన్సిల్ కార్యదర్శిగా జాతీయ అధ్యక్షులు మంత్రి రాందాస్ అత్తవాలా ఆధ్వర్యంలో ఎన్నుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలో ఆర్‌పిఐ తరఫున కష్టపడి పనిచేసే కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన రాష్ట్ర సెక్రెటరీ మిరియాల రమణయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పివి రమణయ్య తెలిపి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్య నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆదివారం కాలుష్యంపై అవగాహన సదస్సును మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కావలిలోని ప్రధాన రహదారుల్లో పలు ప్రాంతాలో వాహనాలను ఒక్క నిమిషం పాటు ఆపి కాలుష్యంపై అవగాహన వాహనదారులకు కల్పించారు. ప్రతిఒక్క వాహనదారుడు కూడా నిబంధనలు పాటించి కాలుష్యాన్ని అరికడితే మన ఊరితో పాటు రాష్ట్రం కూడా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు.

నిందితునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న బాధితులు

నమ్మించి పెట్టబడులు పెట్టించి, ప్లాట్లు ఇస్తామని కొందరిని, అధిక వడ్డీలు ఇస్తామని కొందరిని ప్రలోభపెట్టి కోట్ల రూపాయలు దండుకొని పరారైన వైసిపి నాయకుడు శ్రీ సోమనాథ్ స్టీల్స్ అండ్ సిమెంటు వ్యాపారి ఆమసాల రాజ రమేష్‌బాబును పోలీసు అధికారులు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని భాధితులు భాస్కరుని బదిరి నారాయణ, గుర్రం వెంకట సురేంద్ర, ప్రకాశ్, కొండా వెంకట సుబ్బమ్మ, మస్తాన్ వాపోయారు. ఆదివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కరోనా సమయంలో వ్యాపారం లేక ఉన్న డబ్బులను వడ్డీకి ఇస్తే నెల నెల వడ్డీలతో ఐనా బతకవచ్చని ఆశపడ్డామని తెలిపారు. కొందరు ప్లాట్లు ఇస్తామని తెలిపితే ఆశపడి పెట్టబడి పెట్టామన్నారు. అయితే రాజ రమేష్ అందరినీ మోసం చేసి ఎవరికి తెలియకుండా ఊరు వదిలి పరారయ్యారని తెలిపారు. విషయం తెలుసుకుని విచారణ చేపడితే అతను మమ్మల్నే కాకుండా చాలా మంది దగ్గర ఇలానే డబ్బులు తీసుకుని పరారయ్యారని తెలిసిందన్నారు. ఆయనకు ఉన్న ఆస్తులు కూడా కొన్ని ముందుగానే అమ్ముకొన్నారని మరికొన్ని ఆస్తులు బ్యాంకులో కుదవపెట్టారన్నారు. మరికొన్నింటిని, డబుల్ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. తమకు తెలిసి సుమారు రూ.6 కోట్ల పైన అప్పులు దండుకొని మోసం చేసి పరారయ్యారని కన్నీటిపర్వంతమయ్యారు. గత మూడు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చిన వారందరం పేదవారేనని తమకు ఉన్నతాధికారులు న్యాయం చేయకపోతే తమ బతుకులు రోడ్ల పాలౌతామన్నారు. ఇప్పటికే ఇద్దరు వ్యక్తులు మనోవేదనతో గుండె ఆగి చనిపోయారన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో భాదితులు కొమూరు కిరణ్, కొండా సామ్రాజ్యమ్మ, మాదవ, పులుగు గోపి, ప్రతాప్ కుమార్, పాదర్తి వెంకటేశ్వర్లు, నరశింహులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నెల్లూరు, కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారి సహకారంతో, జి.వంశీ, బి.శ్రీనాద్, ఎన్.శ్రీరాం బ్రహ్మం, జె. గంగాధర్, బి.భాగ్యరాజ్, జి.అనీల్కుమార్, ఎస్.నరేష్, జి.సుజన్, టి.శివ కుమార్, ఎమ్.క్రిష్ణ కిశోర్ దాతృత్వంతో కావలి పట్టణం తుఫాన్ నగర్లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల నందు నాల్గవ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.శ్రీధర్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సుధీర్ కుమార్ రెడ్డి, డాక్టర్ పి.శివ ప్రసాద్, డాక్టర్ ఎ.ఉమాచంద్ పాల్గొని పేదలకు వైద్య సేవలు అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, ఎమ్ అజిత్ బాబు, ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు, పి వి సాయి తేజ, జన విజ్ఞాన వేదిక సభ్యులు షేక్.ఖాధర్ బాషా, శ్రీ చైతన్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని సేవలందించారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల తెలుపుతున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో సంగం, అనంతసాగరం, చేజర్ల మండలాల అధికారులతో ఆయా మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులు, ఇతర సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు అందచేసిన అర్జీలు ఆయా శాఖల అధికారులు నిశితంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలందరికీ ఇళ్ల పథకం నియోజకవర్గంలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ప్రతి సచివాలయం పరిధిలో అధికారులు సమన్వయం చేసుకుని ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మండలస్థాయి అధికారులు ప్రతి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులను పిలిచి వారు ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా నగదును విడుదల చేస్తున్నారని, ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా నగదు మంజూరైన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయం పరిధిలో మంజూరవుతున్న అభివృద్ధి నిధులతో గ్రామానికి అత్యవసరంగా కావాల్సిన అభివృద్ధి పనులను చేపట్టాలని, ముఖ్యంగా విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు రైతులు సన్నధమవుతున్న దృష్ట్యా చెరువులో నీటిలభ్యత, కాలువల్లో పూడికతీత తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలతో పాటు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఎలాంటి అలసత్వం వహించకుండా పనులు చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమలో చేజర్ల, అనంత సాగరం, సంగం మండలాల అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు : ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా టిడిపి యూత్ ముప్పాళ్ల వెంకట్ చౌదరి, ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలేసి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలకు కొత్త అర్థానిచ్చారని తెలిపారు. అనంతరం మజ్జిగ, స్వీట్లు పంచారు. హర్షవర్ధన్ చౌదరి, నాగేంద్ర చౌదరి, పవన్ చౌదరి, మోక్షిత్ చౌదరి, వెంకీ, సురేష్, మహేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : నందమూరి తారక రామారావు శతజయంతిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని జగదేవిపేటలో టిడిపి మండల అధ్యక్షులు రావెర్ల వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మైపాడుకు చెందిన డాక్టర్ పేరిసెట్ల శివకుమార్ రచించిన నందమూరి శతకము పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చెంచు కిషోర్ బాబు, మైనార్టీ నేత ఎస్‌కె.ఇంతియాజ్, కొండూరు సుధాకర్ రెడ్డి, హరినాయుడు, వెంకటేశ్వర్లురెడ్డి, శేషయ్య, తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్ నందమూరి తారకరామారావు అభిమానులు టిడిపి నాయకులు, కార్యకర్తలు శత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంసి వైస్ చైర్మన్ చంద్ర వెంకట సుబ్బనాయుడు, 3వ వార్డు కౌన్సిలర్ గౌస్ భాషా, మధు, మైనారిటీ నాయకులు షేక్ మీరాముద్దీన్, పల్లవోలు జయకర్, తోడేటి వెంకటయ్య, సుబ్బానాయుడు, హజరత్ బాబు, నారాయణ, కొండ ఓంకార్, గురవయ్య, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు ఎన్‌టిఆర్ సినిమా కోసం ఉదయాన్నే క్యూ లైన్‌లో నిలవడి టికెట్ కొనుకున్ని ఫస్ట్ డే మార్నింగ్ షో చూసే వాడని.. ఆయనంటే తనకు అమితమైన అభిమానం.. ఆ అభిమానమే బాలయ్య బాబుతో సాన్నిహిత్యంగా మారిందని టిడిపి నెల్లూరు సిటి ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. 39, 40వ డివిజన్ లో క్లస్టర్ ఇన్‌ఛార్జి అన్నాంగి ప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. మరో అతిథిగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ హాజరయ్యారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని చిరమన గ్రామంలో టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే భారీ కేక్ కట్ చేసి జోహార్ ఎన్‌టిఆర్ అంటూ నినాదాలు చేసి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కంచర్ల శ్రీహరి నాయుడు, గ్రామస్తులు కంచర్ల సురేంద్ర, యు అంకయ్య, కొప్పోలు శ్రీనివాసులు, కొప్పోలు ప్రసాద్, కొప్పోలు వినయ్ కుమార్, కంచర్ల వరప్రసాద్, కంచర్ల విజయ్ కుమార్, కొప్పోలు సురేష్‌కుమార్, అబ్బూరు సుబ్బానాయుడు, ఎన్‌టిఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలను టిడిపి మండల కమిటీ 100 కేజీల కేక్‌ను కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలను కేక్ వివిధ రకాల చిత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న, మైనార్టీ నాయకులు రియాజ్ మాట్లాడుతూ టిడిపి బీద బడుగు బలహీన వర్గాలకు కూడు గూడు గుడ్డ సిద్ధాంతంతో పార్టీని స్థాపించి ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని శక్తిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ చేతుల నుంచి పార్టీ పెట్టిన 9 నెలలు లోనే అధికారం చేజిక్కించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో అనే విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ నరసింహులు, వెంకట స్వామి, ఓబుల్ రెడ్డి, రాజ నరసింహులు సందాని, రామ్మోహన్, రామ్మోహనం, జల్సా, ఆర్‌టిసి ఉద్యోగి సుదర్శన్, షేక్. జానీ బాషా, అర, అభిమానులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉదయగిరిలో...

మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు

ప్రజాశక్తి-సీతారామపురం



మాట్లాడుతున్న మెట్టుకూరి ధనుంజయరెడ్డి

గడచిన 2019 ఎన్నికల సమయంలో వైసిపి మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఉదయగిరి నియోజకవర్గం వైసిపి పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి పేర్కొన్నారు. మాజీ జెడ్పిటిసి దుగ్గిరెడ్డి గురువారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పి.సి.అల్లూరు రాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా మెరుగైన విద్య, వైద్యం ఉండాలని నూతనంగా రాష్ట్రంలో మరో 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి వైద్య శాఖలో వేల ఉద్యోగాలను భర్తీ చేశారని తెలిపారు. నాడు-నేడు కింద ప్రభుత్వ ఆసుపత్రులను పాఠశాలల చూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలలను నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దని అన్నారు. గతంలో విద్యారంగంలో అన్ని స్థానాలు ప్రయివేటు పాఠశాలలు ఉంటే ప్రస్తుతం వైసిపి ప్రభుత్వంలో విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ముందున్నారని ఆయన గుర్తు చేశారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి స్థలం కేటాయించి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, అవ్వతాతలకు 1వ తేదీనే ఉదయాన్నే వాలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం జరుగుతుందని, రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకే అందించే సదుపాయం కల్పించడం, అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి తాను చెప్పినవే కాకుండా ప్రజల అవసరాలను కష్టాలను అర్థం చేసుకొని చెప్పని హామీలను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని తెలియజేశారు. కేవలం పేద ప్రజల కోసమే నిరంతరం వైసిపి పని చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికలలో వైసిపి విజయం మరోసారి తథ్యమని ఆయన జోష్యం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం లబ్ధి పార్టీలకతీతంగా ప్రజలకు అందుతుందని టిడిపి కార్యకర్తలు సైతం వైసిపి పథకాల లబ్ధి పొంది వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలకు ఆకర్షితులవుతున్నారన్నారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గాన్ని తన శాయ శక్తుల అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. వర్గ విభేదాలను పక్కన పెట్టి వైసిపి కార్యకర్తలు నాయకులందరూ కలిసికట్టుగా పనిచేసి ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోయి నష్టపోయిన రైతులు ఆయనకు వినతి పత్రాలను అందజేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు వైసిపి అండగా ఉంటుందని ఈ విషయాన్ని కలెక్టర్ జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఆయన హామీనిచ్చారు. అనంతరం గుండుపల్లిలోని పోలేరమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్, బిట్-1 ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, మాజీ వైస్ ఎంపిపి రామిశెట్టి తిరుపతయ్య, గండిపాలెం మాజీ ఎంపిటిసి పాముల రమణయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.లక్ష అందజేత

ప్రజాశక్తి-సంగం

తాగునీటి సమస్యపై స్పందించి ఆదివారం లక్ష రూపాయలను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అందజేశారు. మండలంలోని పెరమన గ్రామంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న సందర్భంగా పంచాయతీ పరిధిలోని జంగాల దరువు గ్రామంలో తాగునీటికి ఇబ్బందిగా ఉందని వాటర్ ట్యాంక్ మరమ్మతులకు గురైన విషయం గ్రామస్తులు ఎంఎల్ఎకు తెలియజేశారు. వెంటనే ఆత్మకూరు డెవలప్మెంట్ ఫోరం నిధుల నుండి లక్ష రూపాయలు అందజేసి వెంటనే తాగునీటిని పునరుద్ధరించుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారానికి లక్ష రూపాయలు అందజేసిన ఎంఎల్ఎకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.